TG/TEL/25/A3731

# నిజం

దృష్టి తెలుగు న్యూస్

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-202 | పేజీలు:-4 | ఆదివారం 05-07-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

WANTED

రిపోర్టర్లు కావలెను

నిజం దృష్టి తెలుగు న్యూస్

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354

# 20 ఏళ్ల కిందట తన చేతిలో ఓడిన ప్రత్యర్థికి కీలక పదవి

- 20 ఏళ్ల నాటి ప్రత్యర్థి గౌస్ రబ్బానీకి ప్రభుత్వంలో పదవిపై హామీ
- తొలి రాజకీయ విజయానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మిడ్జిల్‌లో పర్యటన
- రబ్బానీకి తగిన బాధ్యతలు అప్పగించాలని డిప్యూటీ సీఎం భట్టికి సూచన




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పూర్వ రాజకీయ ప్రత్యర్థికి కీలక హామీ ఇచ్చారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం జడ్పీటీసీ ఎన్నికల్లో తనపై పోటీ చేసి ఓటమిపాలైన మహమ్మద్ గౌస్ రబ్బానీకి ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన ప్రకటించారు.

## పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం

ఘాటుగా స్పందించిన కవిత



- 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని కవితకు ఈసీ సూచన
- కొత్త పేర్లు పంపకపోతే పార్టీ దరఖాస్తును క్లోజ్ చేస్తామని హెచ్చరిక
- కొత్త పేర్లు పంపే ప్రసక్తే లేదన్న కవిత

సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన (౦ాా)' - మిగతా 2 లో

## తెలంగాణ పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ ఫైర్

- రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పుల కుప్పగా మార్చాయన్న సంజయ్
- రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై రుద్దారని మండిపాటు
- రాష్ట్రం అభివృద్ధిపథంలో సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని వ్యాఖ్య



తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి - మిగతా 2 లో

## శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని వెల్లడి
- పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభాన్ని వ్యూహాత్మకంగా ఎదుర్కొన్నామని స్పష్టం
- చమురు రంగ కంపెనీలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని వెల్లడి
- ఇంధనం అందించే దేశాల సంఖ్యను 40కి పెంచుకున్నామన్న మోదీ




పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సరైన సమయంలో

## మధ్యవర్తిత్వంలో పాకిస్థాన్‌తో పోలిక

చైనా జర్నలిస్టుకు భారత రాయబారి గట్టి కౌంటర్



- పశ్చిమాసియా మధ్యవర్తిత్వంపై పాక్‌తో పోలికను తిరస్కరించిన భారత్
- రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలను చూస్తేనే తేడా తెలుస్తుందన్న రాయబారి
- ఆ పోలిక అన్యాయమని చైనాలో స్పష్టం చేసిన విక్రమ్ దొరైస్వామి

పశ్చిమాసియా వివాదంలో మధ్యవర్తిత్వానికి సంబంధించి భారత్‌ను పాకిస్థాన్‌తో - మిగతా 2 లో

## సంక్షోభంలో టీఎంసీ.. మమతా బెనర్జీ కీలక నిర్ణయం

- బెంగాల్ రాష్ట్ర అధ్యక్ష పదవిని చేపడుతున్నట్లు మమత ప్రకటన
- కొన్ని గంటల ముందే పదవికి రాజీనామా చేసిన చంద్రికా భట్టాచార్య
- కొత్త అధ్యక్షుడిని నియమించడం లేదని, తానే బాధ్యతలు నిర్వహిస్తానన్న మమత



పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)పై పట్టు సాధించేందుకు అధినేత్రి మమతా బెనర్జీ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను - మిగతా 2 లో

## మీరు చాలా పాప్యులర్... ఉషా వాన్స్‌పై ట్రంప్ ప్రశంసలు

- సెకండ్ లేడీ ఉషా వాన్స్ పిల్లల పోడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ట్రంప్
- వైట్‌హౌస్‌లో ఉషాను అందరూ ఇష్టపడతారంటూ ప్రశంస
- ఓవల్ ఆఫీసులో చిన్నారుల పుస్తకాన్ని చదివిన ట్రంప్, ఉషా
- ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను కూడా మెచ్చుకున్న అమెరికా అధ్యక్షుడు
- భారత సంతతికి చెందిన తొలి అమెరికన్ సెకండ్ లేడీగా గుర్తింపు పొందిన ఉషా

2 లో..



## కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు

- వెలికితీస్తాం: సీఎం చంద్రబాబు
- కుప్పాన్ని 'స్వర్ణ కుప్పం'గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు
- రూ.118 కోట్లతో ఆధునిక బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శంకుస్థాపన
- కర్నూలు జిల్లా జొన్నగిరి తరహాలోనే కుప్పంలోనూ బంగారు గనులు ఉన్నాయని వెల్లడి
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు, సీమలో ఫ్యాక్షన్ యుగం ముగిసిందని స్పష్టీకరణ
- అమరావతి రాజధానిగా ఉండాలని ప్రజలు కోరుకుంటే, గొడ్డలి పార్టీ 'మావిగన్' అంటోందని ఎద్దేవా




తన సొంత నియోజకవర్గమైన కుప్పాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా, దేశానికే ఆదర్శంగా నిలిపే 'స్వర్ణ కుప్పం' నిర్మాణానికి నాంది పలుకుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుప్పం పర్యటనలో భాగంగా...

## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం

- జూలై 5 నుంచి 11 వరకు కొరియాలో పర్యటన
- ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఎజెండా
- ఎల్జీ, హ్యోసంగ్ వంటి దిగ్గజ సంస్థలతో కీలక సమావేశాలు
- సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం కొరియాలో ప్రత్యేక రోడ్ షో



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో తమ దేశంలో పర్యటించాలని రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) ప్రభుత్వం ఆయన్ను అధికారికంగా ఆహ్వానించింది. ఈ మేరకు ఆయన జూలై 5 నుంచి 11వ తేదీ వరకు కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్.. కొరియాలోని పలు మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక సమావేశాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన - మిగతా 2 లో

## పాపికొండల విహార యాత్రకు గ్రీన్ సిగ్నల్

20 రోజుల తర్వాత పునఃప్రారంభం

- 20 రోజుల విరామం తర్వాత తిరిగి ప్రారంభంకానున్న పాపికొండల యాత్ర
- సాంకేతిక లోపంతో నిలిచిపోయిన విహార యాత్రకు అధికారుల గ్రీన్ సిగ్నల్
- తనిఖీల అనంతరం 15 ప్రైవేట్, ఒక ఏపీటీడీసీ బోటుకు అనుమతి



పర్యాటకులకు, ప్రకృతి ప్రేమికులకు శుభవార్త. గోదావరి నదిలో రమణీయ దృశ్యాలకు నెలవైన పాపికొండల విహార యాత్రకు మార్గం సుగమమైంది. సాంకేతిక కారణాలతో సుమారు 20 రోజుల పాటు నిలిచిపోయిన - మిగతా 2 లో

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
ఆదివారం 05-07-2026

# ఎస్ ఐ ఆర్ ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్ చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి





**మేడిపల్లి,జూలై 4,జనం న్యూస్:** మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్‌లో కొనసాగుతున్న ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ ( ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. పీర్జాదిగూడ, మేడిపల్లి, బోడుప్పల్, చెంగిచర్ల డివిజన్లలోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించిన ఆయన, మాజీ మేయర్లు జక్క వెంకట్ రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు--కార్యదర్శులు, బి ఎల్ ఏ లతో కలిసి జరుగుతున్న ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి బూత్‌లో ఫారాల పంపిణీ, దరఖాస్తుల స్వీకరణ, ఓటర్లకు అందుతున్న సహాయం, బి ఎల్ ఏ ల పనితీరు, ప్రజల స్పందన వంటి అంశాలను పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. పలువురు ఓటర్లు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించగా, వాటిని వెంటనే బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ శైలజ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు బూత్‌లలో నమోదై ఉండడం, చిరునామా మార్పులు, మొబైల్ నంబర్లు లింక్ కాకపోవడం, నిరక్షరాస్యులు, వృద్ధులు మరియు మహిళలు ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సహాయక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు. డిప్యూటీ కమిషనర్ శైలజ సానుకూలంగా స్పందిస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపడతామని, ప్రతి అర్హుడికి సహాయం అందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్ రెడ్డి, మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బిఎల్ఎల సమీక్ష సమావేశంలో రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అత్యంత బాధ్యతగా తీసుకుని ప్రతి ఇంటికి చేరుకోవాలని, ఒక్క అర్హుడి ఓటు కూడా మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బి ఎల్ ఏ లకు సూచించారు. ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ, ఫారాల నింపడంలో అవసరమైన సహాయాన్ని అందించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ప్రతి సమస్యను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తదనంతరం బోడుప్పల్, చెంగిచర్ల డివిజన్లలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి, ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అధికారులు, బి ఎల్ ఏ లు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేస్తే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, నాయకులు ఆకుల మధుకర్, శ్యామల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు ప్రభు, బోడుప్పల్ సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, మీసాల కృష్ణ, చక్రపాణి గౌడ్, కాటేపల్లి రామచంద్రారెడ్డి, బండారం శ్రీధర్ గౌడ్, అలీం, ఘట్‌కేసర్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో మరింత తీవ్రం

- ❖జూలై, సెప్టెంబరు మధ్య ఉగ్రరూపం.. ఎదుర్కోవడానికి దేశాలన్నీ సిద్ధం కావాలి
- ❖ఐరాస సంస్థ డబ్ల్యూఎంవో హెచ్చరిక
- ❖భారత్‌లోని వర్షపాతంలో తీవ్ర వైరుధ్యం
- ❖జూన్‌లో 79 శాతం భూభాగంలో లోటు



**నిజం న్యూస్ న్యూఢిల్లీ, జూలై 4:** ఇప్పటికే ఏర్పడ్డ ఎల్‌నినో పరిస్థితులు వేగంగా బలపడుతున్నాయని, జూలై, సెప్టెంబరు మధ్యలో అది ఉగ్రరూపం దాల్చుతుందని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) హెచ్చరించింది. వచ్చే రోజుల్లో ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో తీవ్రమైన వాతావరణ పరిస్థితి నెలకొంటుందని పేర్కొంది. ఈ పరిస్థితులు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ప్రపంచ దేశాలకు సూచించింది. సాధారణంగా ఎల్‌నినో పరిస్థితిని బట్టి బలహీనం, మధ్యస్థం, తీవ్రం, అత్యంత తీవ్రంగా డబ్ల్యూఎంవో విభజిస్తుంది. ఈఏడాది ఎల్‌నినో పరిస్థితి తీవ్ర స్థాయికి చేరుకుంటుందని ఆ సంస్థ హెచ్చరించింది. కీలకమైన ప్రాంతాల్లో సగటు సముద్ర ఉష్ణోగ్రత 2 డిగ్రీల సెల్సియస్ పెరగవచ్చని అంచనా వేసింది. ఉత్తరార్ధగోళంలో వచ్చే శరదృతువులో ఎల్‌నినో మరింత బలపడుతుందని, దీని ప్రభావం ప్రపంచం అంతా పడుతుందని తెలిపింది. ఇదే సమయంలో భూమధ్య రేఖ వద్ద అట్లాంటిక్ ప్రాంతంలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం బలపడుతున్న ఎల్‌నినో కారణంగా పలు రీజియన్లలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడంతో పాటు తీవ్రమైన వర్షపాతం, భూమి, సముద్రంపై తీవ్రమైన వేడిగాలుల ప్రభావం ఉంటుందని డబ్ల్యూఎంవో చీఫ్ సెలెస్టే సాలో చెప్పారు. ఈ ఎల్‌నినో సమయంలో 60 డిగ్రీల ఉత్తరం, 60 డిగ్రీల దక్షిణం మధ్య ఉన్న భూ భాగంలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రత నమోదుకానుంది. జూలై, సెప్టెంబరు నెలల్లో అంచనా వేసిన వర్షపాతం కూడా ఎల్‌నినో బలపడుతోందనడానికి ఊతం ఇస్తోంది. నైరుతి అమెరికా ప్రాంతంలో సాధారణం కంటే ఎక్కువగా, భారత్ ఉపఖండం, ఆస్ట్రేలియాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షం కురుస్తుందని డబ్ల్యూఎంవో తెలిపింది. ఉత్తరార్ధగోళంలో వేసవి, ఎల్‌నినో పరిస్థితులతో మధ్య, తూర్పు పసిఫిక్ ప్రాంతంలో హరికేన్లు చెలరేగుతాయి. అయితే అట్లాంటిక్ సముద్రంలో మాత్రం ఆ పరిస్థితి ఉండదు.

**భారత్‌లో పరిస్థితి ఏంటి?**

దేశ వాతావరణ పరిస్థితుల్లో తీవ్ర వైవిధ్యం కనిపిస్తోంది. ఒకవైపు రుతుపవనాల్లో మందకొడి తనంతో కరువు పరిస్థితులు నెలకొనగా, కొన్ని చోట్ల మేఘ విస్పోటం లాంటి పరిస్థితులతో వరదలు ముంచెత్తుతున్నాయి. అయితే దేశ వ్యాప్తంగా చూస్తే ఈ సీజన్‌లో సుమారు 38 శాతం లోటు వర్షపాతం నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే రికార్డు వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి జూలై 1 మధ్య వ్యవసాయం, జలాశయాల పరిస్థితి ఆందోళనకంగా ఉంది. దేశంలోని 29 రాష్ట్రాల పరిధిలో 79 శాతం భూభాగం లోటు లేదా తీవ్ర లోటు వర్షపాత ప్రాంతాలుగా నిలిచాయి. ఈ నెలలో సాధారణ సగటు 172.9 మిల్లీమీటర్ల వర్షపాతంగా ఉండగా, దేశంలో 108.1 మిల్లీమీటర్ల వర్షమే పడింది. అంటే దేశ వ్యాప్తంగా 37.5 శాతం వర్షపాత లోటు ఏర్పడిందని ఐఎండీ స్పష్టం చేసింది. దేశంలో ఐఎండీ పర్యవేక్షణలో 741 జిల్లాల్లోని 535 జిల్లాల్లో (72 శాతం) లోటు లేదా తీవ్ర లోటు వర్షపాత పరిస్థితులు ఉన్నాయి. కేవలం 201 జిల్లాల్లో (27 శాతం) మాత్రమే సాధారణం లేదా ఎక్కువ వర్షపాతం నమోదైంది.

**కరువు పరిస్థితులు.. ఆందోళనలో రైతులు**

దేశంలో చాలా ప్రాంతాల్లో కరువు పరిస్థితులు తీవ్రమవుతున్నాయి. జూన్ ప్రారంభంలో పరిస్థితులు కాస్త మెరుగ్గా ఉన్నా, నెలాఖరుకు వచ్చే సరికి కరువు ఛాయలు విజృంభించాయి. దీంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. వర్షాలు లేకపోవడం వల్ల రైతులు చెరువులు, రిజర్వాయర్లపై ఆధారపడటం పెరగడం వల్ల అవి అడుగంటిపోయే అవకాశం కూడా ఉంది. మరోవైపు, దేశంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో పరిస్థితులను కేంద్రం నిశితంగా పరిశీలిస్తోంది. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలసి హోం మంత్రి అమిత్ షా శుక్రవారం అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. కరువు పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని కేంద్ర శాఖలన్నింటికీ సూచించారు.

# రాజకీయ అండతో చట్టాన్ని ధిక్కరిస్తున్నారా....?




**మేడిపల్లి, జూలై 04, నిజం న్యూస్ :** బోడుప్పల్ దేవేందర్ నగర్‌లో జరిగిన దాడి ఘటనకు సంబంధించి కేసు నమోదై రోజులు గడుస్తున్నప్పటికీ, పలువురు నిందితులు ఇప్పటికీ పరారీలో ఉండడం తీవ్ర చర్చకు దారితీసింది. దర్యాప్తు జరుగుతోందని పోలీసులు చెబుతున్నప్పటికీ, ప్రధాన నిందితులు ఇంకా పోలీసుల అదుపులోకి రాకపోవడంపై బాధిత కుటుంబంతో పాటు స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ప్రధాన సూత్రధారులు స్వేచ్ఛగా తిరుగుతున్నారనే ప్రచారం**

స్థానికంగా వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, ఈ ఘటనకు ప్రధాన సూత్రధారులుగా భావిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఎలాంటి భయం లేకుండా ఇతర ప్రాంతాల్లో తిరుగుతూ, టూర్లు ఎంజాయ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు నిజంగా వారిని వెతుకుతున్నారా? లేక కేవలం దర్యాప్తు పేరుతో కాలయాపన చేస్తున్నారా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

**సీడీఆర్ తీస్తే ఆచూకీ దొరుకుతుందనే అభిప్రాయం**

దర్యాప్తులో భాగంగా చట్టబద్ధమైన విధానంలో మొబైల్ కాల్ డీటెయిల్ రికార్డులు (సీడీఆర్ ), లొకేషన్ విశ్లేషణ వంటి సాంకేతిక ఆధారాలను వినియోగిస్తే పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ సులభంగా లభించే అవకాశం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే పోలీసులు ఆ దిశగా తగిన చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**సాంకేతిక యుగంలోనూ నిందితులు దొరకకపోవడం ఆశ్చర్యమేనా?**

సీసీ కెమెరాలు, మొబైల్ టవర్ లొకేషన్లు, డిజిటల్ ఆధారాలు అందుబాటులో ఉన్న ఈ రోజుల్లోనూ నిందితులను గుర్తించలేకపోవడం సహజమేనా అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. సాంకేతికంగా బలమైన దర్యాప్తు జరిగితే నిజాలు త్వరగా బయటపడతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**రాజకీయ అండ ఉందనే ఆరోపణలు**

ఈ కేసులో కొందరు రాజకీయ నాయకులు నిందితులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అదే కారణంగా దర్యాప్తు వేగం తగ్గిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు.

**బాధిత కుటుంబంలో భయాందోళనలు**

ప్రధాన నిందితులు ఇంకా అరెస్టు కాకపోవడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉందని సమాచారం. నిందితులు బయట తిరుగుతున్నారనే ప్రచారం కారణంగా మళ్లీ ఎలాంటి ఘటన జరుగుతుందోననే భయం వారిని వెంటాడుతోందని స్థానికులు చెబుతున్నారు.

**చట్టం ముందు అందరూ సమానమేనా?**

సామాన్య ప్రజల విషయంలో వేగంగా స్పందించే పోలీసులు, ఈ కేసులో మాత్రం ఎందుకు అదే వేగాన్ని చూపడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. చట్టం ముందు అందరూ సమానమే అయితే, ఈ కేసులోనూ అదే సూత్రం అమలు కావాలని ప్రజలు కోరుతున్నారు.

**పోలీసులపై పెరుగుతున్న అనుమానాలు**

నిందితులు అందుబాటులో ఉన్నప్పటికీ అరెస్టులు జరగడం లేదనే ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీనివల్ల పోలీసు శాఖ పనితీరుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలకు తెరపడాలంటే దర్యాప్తులో వేగం పెంచి, చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలన్న డిమాండ్**

ఈ కేసులో ఉన్నత పోలీసు అధికారులు స్వయంగా జోక్యం చేసుకుని దర్యాప్తు పురోగతిని సమీక్షించాలని, పరారీలో ఉన్న నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టం ముందు నిలబెట్టాలని స్థానికులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**ప్రజలు ఎదురుచూస్తున్నది ఒక్కటే... న్యాయం**

కేసు నమోదు చేయడం ఒక్కటే సరిపోదని, నిందితులను చట్టం ముందు నిలబెట్టి బాధితులకు న్యాయం చేయడమే పోలీసు శాఖ అసలు బాధ్యత అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ కేసులో తీసుకునే తదుపరి చర్యలే పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని నిర్ణయిస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

# కూకట్‌పల్లిలో ఘనంగా వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 4:** కూకట్‌పల్లి కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెపిహెచ్బి టెంపుల్ బస్ స్టాప్ వద్ద నిర్వహించిన ప్రజా నాయకుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకల్లో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అసోసియేషన్ సభ్యుల ఆహ్వానం మేరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ, ప్రజల కోసం నిరంతరం పోరాడిన ధైర్యవంతుడైన నాయకుడు వంగవీటి మోహనరంగా అని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజా సేవే పరమావధిగా భావించి చివరి శ్వాస వరకు ప్రజల కోసం పనిచేసిన మహోన్నత వ్యక్తిత్వం రంగా ని అన్నారు. ఈ కార్యక్రమంలో కేపిహెచ్బి కంటెస్టెంట్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి, కూకట్‌పల్లి కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమర వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు



మేడిపల్లి, **జూలై 04 నిజం న్యూస్:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుపల్ సర్కిల్ పరిధిలో ఉప్పల్ బస్ డిపో ఎదురుగా తెలంగాణ సాయుధ పోరాట యోధులు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి నీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు బాపురాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇరువురు మాట్లాడుతూ.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమర వీరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు తెలియజేస్తూ నిజాం నిరంకుశ పాలనకు, దోపిడీ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా రైతుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు దొడ్డి కొమురయ్య. ఆయన ఆశయాలు నేటికీ సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు జె. లక్ష్మి, బి కే ఎం యు మండల కార్యదర్శి మహాలక్ష్మి, అధ్యక్షులు బి. ఐలయ్య, బీసీ సంఘం కార్యదర్శి నర్సమ్మ, సిపిఐ పార్టీ కౌన్సిల్ సభ్యులు రామతార, సరిత, అండాలు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# కైతలాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కలికోట శంకర్ బండి రమేష్ ఆశీస్సులతో బాధ్యతల స్వీకరణ



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 4:** కైతలాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా కలికోట శంకర్ నియమితులయ్యారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్ ఆదేశాల మేరకు ఆయన ఈ పదవి చేపట్టారు.శనివారం బండి రమేష్ నీ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. సీనియర్ నాయకుల మద్దతుతో తనను గుర్తించి అవకాశం ఇచ్చినందుకు బండి రమేష్ అన్న కు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.బండి రమేష్ అడుగుజాడల్లో నడుస్తూ, రేవంత్ రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తా. ప్రజా సేవకు ఎప్పుడూ వెనుకాడను' అని శంకర్ అన్నారు. కార్యక్రమంలో మోయిజ్,యూత్ ప్రెసిడెంట్ సలీం,యువజన కాంగ్రెస్ కార్యదర్శి శ్రవణ్,ఖైతలాపూర్ డివిజన్ యూత్ అధ్యక్షుడు సుల్తాన్, బాలకృష్ణ, నరేందర్, చిన్న, గౌస్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# వంగవీటి మోహనరంగా సేవలు చిరస్మరణీయం: బండి రమేష్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 4:** మాజీ ఎమ్మెల్యే, ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా శనివారం కేపీహెచ్‌బీ టెంపుల్ బస్ స్టాప్ వద్ద ఘనంగా నిర్వహించిన జయంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మోహనరంగా ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. సమాజ సేవ, ధైర్యసాహసాలు, ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కూకట్పల్లి ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ,నాయకులు గంధం రాజు ,రంగమోహన్, కరుణాకర్, భరత్, అరవింద్ రెడ్డి, కిలారు శ్రీనివాస్ బాబు, రాజేష్ గౌడ్, నళిని కాంత్ ,బాలరాజు, రాము, నవీన్ , కామినేని వాసు,వనజ ,సుజాత, వాణి, అరుణ్ స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని మోహనరంగా కి ఘన నివాళులు అర్పించారు.

# పర్యాటక రంగంలో గ్లోబల్ వకేషన్స్ సంస్థ విశేష విజయాలు సాధించాలి -- వడ్డేపల్లి రాజేశ్వరరావు




**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 4:** కేపీహెచ్‌బీ సమీపంలోని గ్లోబల్ వేకేషన్స్ ఎల్‌ఎల్‌పీ నూతన కార్పొరేట్ కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించబడింది. సంస్థ వ్యవస్థాపకులు కోలా హరిప్రసాద్ ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కెపిహెచ్బి కంటెస్టెంట్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి తో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.కోలా హరిప్రసాద్ వడ్డేపల్లి రాజేశ్వరరావు కి ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, నేటి ఆధునిక యుగంలో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ గ్లోబల్ వకేషన్స్ సంస్థ విశ్వసనీయ సంస్థగా ఎదగాలని ఆకాంక్షించారు.సేవా దృక్పథం, పారదర్శకత, వినియోగదారుల విశ్వాసమే ఏ సంస్థ విజయానికి పునాదులని పేర్కొన్నారు. యువ పారిశ్రామికవేత్తలు ఉపాధి అవకాశాలను సృష్టిస్తూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడడం అభినందనీయమని అన్నారు. సంస్థ వ్యవస్థాపకులు కోలా హరిప్రసాద్ కి,సహ వ్యవస్థాపకురాలు తేజస్వి గుబ్బ కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# రూ.10 లక్షలు ఇస్తే రూ.40 లక్షల బ్లాక్ మనీ ఇస్తామని ఆశ చూపించి అమాయకులను మోసం చేస్తున్న 12 మంది సభ్యులతో కూడిన ముఠా గుట్టును పోలీసులు రట్టు రట్టు చేశారు



**నిజం న్యూస్ హైదరాబాద్, జూలై 4:** ముఠాలోని ఓ సభ్యుడు బాధితులకు ఫోన్ చేసి, తన వద్ద రూ.2 కోట్ల బ్లాక్ మనీ ఉందని, దాన్ని వైట్‌గా మార్చుకోవాల్సి ఉందని చెబుతాడు. ఇందుకు రూ.10 లక్షలు ఇస్తే, ప్రతిగా రూ.40 లక్షలు ఇస్తానని నమ్మిస్తాడు. బాధితుడు డబ్బులతో వచ్చిన తర్వాత, ఫేక్ నోట్లతో నింపిన బ్యాగ్‌ను తన అనుచరుడి ద్వారా అందజేస్తారు. అదే సమయంలో నకిలీ పోలీసుల వేషంలో వచ్చిన ముఠా సభ్యులు దాడి చేసి, దొంగనోట్ల వ్యాపారం చేస్తున్నారని, మోస్ట్ వాంటెడ్ నేరస్థులని బెదిరించి బాధితుడి వద్ద ఉన్న నగదును తీసుకుని పరారవుతారు. ఈ మోసానికి గురైన ప్రొద్దుటూరుకు చెందిన గంగాధర్‌రెడ్డి ఫిర్యాదుతో ఈ ముఠా బాగోతం వెలుగులోకి వచ్చింది. కేసులో మొత్తం 12 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.18 లక్షల నగదు, 16 మొబైల్ ఫోన్లు, నకిలీ పోలీసు యూనిఫాంలు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
ఆదివారం 05-07-2026



# పాత తరం హీరోయిన్లను మరిపించిన త్రిష!

దశాబ్దం పాటు స్టార్‌డమ్‌ను కాపాడుకోవడమే గొప్ప విషయంగా భావించే ఈ రోజుల్లో ఏకంగా 27 ఏళ్లుగా చిత్ర పరిశ్రమలో అగ్ర స్థానంలో కొనసాగడం అద్భుతం. దక్షిణాది సినిమా ఇండస్ట్రీలో సీనియర్ నటి త్రిష కృష్ణన్ సాధించిన ఈ ఘనత పాత కాలపు మహానటీమణుల సుదీర్ఘ ప్రస్థానాన్ని గుర్తుచేస్తోంది. నాటి తరం కథానాయికలు దశాబ్దాల పాటు వెండితెరను ఎలాగైతే ఏలారో? త్రిష సైతం అదే రీతిలో నటనతో? చరిష్మాతో నేటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. సాధారణంగా గ్లామర్ ప్రపంచంలో కొత్త తరం నటీమణుల రాకతో పాతవారు వెనకబడిపోవడం సహజం. కానీ త్రిష విషయంలో ఈ సమీకరణాలు మారిపోయాయి. 1999వ సంవత్సరం ప్రారంభంలో కెరీర్ ప్రారంభించిన అమ్మడు నాటి స్టార్ హీరోల నుండి నేటి తరం యంగ్ హీరోల వరకు అందరితోనూ స్క్రీన్ షేర్ చేసుకుంటూ దూసుకుపోతోంది. కాలం మారుతున్నా? ప్రేక్షకుల అభిరుచులు మారుతున్నా? త్రిష క్రేజ్ ఏమాత్రం తగ్గకపోవడం వృత్తిపై ఉన్న అంకితభావాన్ని స్పష్టం చేస్తోంది. త్రిష సమకాలీనులైన నయనతార, అనుష్క శెట్టి వంటి అగ్ర నటీమణులు కూడా పరిశ్రమలో దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. వారు కూడా సౌత్ సినిమాపై తమదైన ముద్ర వేసినా.. అనుష్క సినిమాల సంఖ్య తగ్గింది. నయనతార కూడా సెలక్టివ్ గానే వెళ్తోంది. వీరితో పోలిస్తే త్రిష 27 ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్నా? ఇప్పటికీ కమర్షియల్, పాన్-ఇండియా , భారీ బడ్జెట్ చిత్రాలలో బిజీగా అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో త్రిష తనను తాను నిరంతరం కొత్తగా ఆవిష్కరించుకుంటూ వచ్చింది. కెరీర్ ప్రారంభంలో గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా -వర్షం-, -నువ్వొస్తానంటే నేనొద్దంటానా- వంటి చిత్రాలతో నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంది. తదుపరి కాలంలో -96- , -పొన్నియిన్ సెల్వన్- వంటి చిత్రాలు కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. పాత్ర ఏదైనా ? అందులో లీనమైపోయే నైపుణ్యమే మూడు తరాల ప్రేక్షకులను ఆమెకు అభిమానులుగా మార్చింది. సావిత్రి, జమున, జయప్రద, శ్రీదేవి వంటి నటీమణులు మాత్రమే రెండు, మూడు దశాబ్దాల పాటు చిత్ర పరిశ్రమలో తిరుగులేని నాయికలుగా వెలిగారు. ఆ తర్వాత కాలంలో కథానాయికల ప్రాధాన్యత.. కెరీర్ స్పాన్ తగ్గుతూ వచ్చిన తరుణంలో త్రిష మళ్లీ ఆ పాత తరం సెంటిమెంట్‌ను, సుదీర్ఘ వైభవాన్ని పునరావృతం చేస్తుంది. నేటి గ్లామర్ ప్రపంచంలో ఒక నటి ఇంత కాలం పాటు టాప్ లీగ్‌లో కొనసాగడం అనేది అదృష్టం వల్ల సాధ్యం కాదు. అందుకు ఎనలేని కృషి, పట్టుదల ఎంతో అవసరం. ప్రస్తుతం త్రిష చేతిలో ఉన్న ప్రాజెక్టలను చూస్తే? జోరు ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు. అగ్ర దర్శకులు, పెద్ద నిర్మాణ సంస్థలు ఇప్పటికీ త్రిష డేట్స్ కోసం వేచి చూస్తుండటం విశేషం.

# ఈ పులులు పైలమేనా!?

**సేవ్ ద టైగర్స్-3**

**జియో హాట్‌స్టార్: స్ట్రీమింగ్ అవుతున్నది**



తారాగణం: ప్రియదర్శి, అభినవ్ గోమఠం, చైతన్యకృష్ణ, వెన్నెల కిషోర్, సీరత్ కపూర్, జోర్దార్ సుజాత, పావని గంగిరెడ్డి తదితరులు దర్శకత్వం: శ్రీరామ్

కుటుంబ కథలు అనగానే.. కష్టాలు, కన్నీళ్లే కళ్లముందు కదలాడుతాయి. అయితే, వెండితెరపై కామెడీని పండించిన ఫ్యామిలీ స్టోరీలూ ఉన్నాయి. భార్యాభర్తల మధ్య జరిగే చిన్నచిన్న గొడవల్ని సరదాగా చూపించాయి. ప్రేక్షకుల మోముపై నవ్వులు పూయించడంతోపాటు ఫ్యామిలీలో సర్దుకుపోవడాలు, కుటుంబ విలువలనూ నేర్పించాయి. ఇలాంటి కుటుంబ నేపథ్యంలో వచ్చిన తెలుగు వెబ్‌సిరీస్.. సేవ్ ద టైగర్స్. ఇప్పటికే వచ్చిన రెండు సీజన్లూ ప్రేక్షకులను బాగానే అలరించాయి. ఇటీవలే జియో హాట్‌స్టార్ వేదికగా.. మూడో సీజన్ కూడా విడుదలైంది. రికార్డ్ స్ట్రీమింగ్‌తో దూసుకెళ్తున్నది. కథలోకి వెళ్తే.. మొదటి సీజన్‌లో మొదలైన గంటా రవి, విక్రమ్, రాహుల్ స్నేహంతోపాటు.. వారి జీవితాల్లో అశాంతి, అసహనం కొనసాగుతూనే ఉంటుంది. ఎమ్మెల్యే కావాలనే ఆశతో ఎన్నికల్లో పోటీచేసి, ఆస్తులన్నీ పోగొట్టుకుంటాడు గంటా రవి (ప్రియదర్శి). భార్య హైమా (జోర్దార్ సుజాత) పోరు పడలేక బస్తీ నుంచి గేటెడ్ కమ్యూనిటీకి మారుతాడు. ఇక విక్రమ్ (చైతన్య కృష్ణ)కు విడాకులు ఇచ్చేందుకు సిద్ధమవుతుంది భార్య రేఖ (దేవయాని). ఈ కేసు వల్ల అతని ఉద్యోగం పోవడంతోపాటు స్టార్టప్ కంపెనీ కూడా మూతపడుతుంది. మరోవైపు రాహుల్ (అభినవ్ గోమఠం).. భార్య మాధురి (పావని గంగిరెడ్డి) కోరిక మేరకు రైటింగ్ ఆపేసి, బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరుతాడు. అయితే, నోటి దురుసు వల్ల కొద్ది రోజుల్లోనే ఉద్యోగాన్ని కోల్పోయి, హైదరాబాద్ వచ్చేస్తాడు. తమ కష్టాలు చెప్పుకోవడానికి ముగ్గురూ ఓరోజు బార్‌కు చేరుకుంటారు. మద్యం మత్తులో మరో ముగ్గురిని కిడ్నాప్ చేస్తారు. అయితే, ఆ కిడ్నాప్ అయినవాళ్లు కూడా వీళ్ల పోలికలతోనే ఉంటారు. అసలు.. వాళ్లెవరు? ఈ ముగ్గురితో.. ఆ ముగ్గురికి వచ్చిన సమస్యలు ఏంటి? ఇందులో ఇంద్రుడు (వెన్నెల కిషోర్) పాత్ర ఏమిటి? అసలు హీరోయిన్ హంసలేఖతో గంటా రవికి ఉన్న గొడవలు ఏమిటి? గేటెడ్ కమ్యూనిటీకి వెళ్దామని పోరు పెట్టిన హైమా.. అక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నది? విక్రమ్-దేవయాని విడాకులకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? రాహుల్‌పై వంద మంది అమ్మాయిలు ఎందుకు కేసులు పెట్టారు? రాహుల్ భార్య మాధురీ.. అబార్షన్ చేయించుకోవాలని ఎందుకు నిర్ణయించుకున్నది? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానమే..'సేవ్ ద టైగర్స్-3' కథ.



# ఫాంటసీ ఁ మిస్టరీ స్టోరీస్ బూమ్.. కొత్త జనరేషన్‌కు ఎందుకు ఇంత ఆకర్షణ?

ఈ మధ్య కాలంలో సినిమా ఇండస్ట్రీలో ఒక సరికొత్త ట్రెండ్ నడుస్తోంది. లవ్, యాక్షన్ సినిమాల కంటే ఎక్కువగా ప్రేక్షకులు 'ఫాంటసీ, మిస్టరీ, మైథాలజీ' కథల వైపు బాగా ఆకర్షితులవుతున్నారు. తాజాగా అభిషేక్ నామా డైరెక్షన్‌లో విరాట్ కర్ణ హీరోగా వస్తున్న 'నాగబంధం' అనే విజువల్ అడ్వెంచర్ సినిమాకు రిలీజ్ ముందే వస్తున్న క్రేజ్ దీనికి ఒక బెస్ట్ ఎగ్జాంపుల్. అసలు ఈ ఆధునిక డిజిటల్ యుగంలో కొత్త జనరేషన్ మన రూట్స్ వైపు ఎందుకు ప్రయాణిస్తోంది? ఈ జోనర్ కథల బూమ్‌కి గల అసలు కారణాలు ఏంటో చూద్దాం.. ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ ఫాంటసీ అడ్వెంచర్ మూవీగా 'నాగబంధం' నిలిచింది. ఇక టీజర్, ట్రైలర్ మరియు సాంగ్స్‌తో ఈ సినిమా సృష్టించిన హడావుడి అంతా ఇంతా కాదు. జూలై 3న విడుదల కాబోతున్న ఈ చిత్రం రిలీజ్ కాకముందే భారీ థియేట్రికల్, నాన్ థియేట్రికల్ బిజినెస్ నమోదు చేసింది. నైజాంలో దిల్ రాజు, సీడెడ్‌లో శ్రీ గురు రాఘవేంద్ర, అలాగే ఓవర్సీస్ అండ్ నార్త్ ఇండియాలో జీ స్టూడియోస్ వంటి టాప్ డిస్ట్రిబ్యూటర్లు భారీ రేట్లకు ఈ సినిమా హక్కులను సొంతం చేసుకోవడం ఈ జోనర్‌కు ఉన్న క్రేజ్‌ను చెప్తోంది. ఈ డిజిటల్ యుగంలో యువత రోజూవారీ రొటీన్ లైఫ్, స్ట్రెస్ నుంచి కాసేపు బయటపడటానికి ఇష్టపడుతోంది. ఫాంటసీ, మిస్టరీ కథలు ప్రేక్షకులను ఒక కొత్త లోకంలోకి తీసుకెళ్తాయి. లార్జర్ దాన్ లైఫ్ విజువల్స్, వింత శక్తులు, నిధి అన్వేషణ వంటి కాన్సెప్టులు థియేటర్లలో ప్రేక్షకులకు ఒక సరికొత్త థ్రిల్‌ను అందిస్తున్నాయి. ఇక అందుకే థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ కోసం ఇలాంటి సినిమాలను చూడటానికే ప్రేక్షకులు ఎగబడుతున్నారు. కొత్త జనరేషన్ మన పురాణాలు, ఇతిహాసాల వెనుక ఉన్న సైన్స్ మరియు రహస్యాలను తెలుసుకోవడానికి చాలా కుతూహలం చూపిస్తోంది. ఇక మన ప్రాచీన సంస్కృతిలో దాగున్న గుప్తనిధులు, శపించబడిన దేవాలయాలు, నాగలోకం వంటి మిస్టరీ అంశాలకు నేటి సాంకేతికత జోడించి వెండితెరపై చూపిస్తుంటే యువత బాగా కనెక్ట్ అవుతోంది. ఫాంటసీ, మైథాలజీ కథలకు భాషతో సంబంధం ఉండదు. 'నాగబంధం' సినిమాను కూడా కేవలం తెలుగులోనే కాకుండా కన్నడ,తమిళం, కేరళ ఇలా సౌత్ మొత్తం మరియు నార్త్ ఇండియాలో భారీగా రిలీజ్ చేస్తున్నారు. ఇక కథలో ఉండే యూనివర్సల్ పాయింట్ వల్ల ఈ జోనర్ సినిమాలు దేశవ్యాప్తంగా అందరికీ సులువుగా కనెక్ట్ అయిపోయి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి. రొటీన్ ఫార్ములా కథల కంటే భిన్నంగా, మన మూలాలను వెతుక్కుంటూ వెళ్లే ఫాంటసీ సినిమాలకు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారు. ఇక జూలై 3న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'నాగబంధం' కూడా అదే మ్యాజిక్‌ను రిపీట్ చేసి, కొత్త జనరేషన్‌కు మరింత ఫాంటసీ కిక్ ఇస్తుందని ఆశిద్దాం..

# జోరు పెంచిన నవీన్ పోలిశెట్టి

# ఏకంగా కోలీవుడ్ డైరెక్టర్ తో కొత్త మూవీ!

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న నవీన్ పోలిశెట్టి.. ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ లో జోరు పెంచారు. ముఖ్యంగా అటు స్టార్ డైరెక్టర్లతో అవకాశాలు కుదుర్చుకుంటూనే.. ఇటు కొత్త నిర్మాణ సంస్థలతో సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ బిజీగా మారిపోయారు. ఇక రెండు రోజుల క్రితమే టాలీవుడ్ బడా దర్శకులు , నిర్మాతలతో కలసి గెట్ టుగెదర్ లో సందడి చేసిన ఈయన తాజాగా పక్క ఇండస్ట్రీపై దృష్టి మరల్చడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అసలు విషయంలోకి వెళ్తే .. ఇటీవల మైత్రి మూవీ మేకర్స్ ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేకమైన గెట్ టుగెదర్ పార్టీలో ఇండియన్ సినీ ఇండస్ట్రీకి చెందిన దిగ్గజ దర్శకులు ఒకే చోట చేరి సందడి చేశారు. ఇక వీరందరిని ఒకే చోట నిలబెట్టి నా లైఫ్ లోనే అత్యంత కాస్ట్లీ యెస్ట్ ఫ్రేమ్ ఇదే . మొత్తం రూ.5,500 కోట్ల ఫ్రేమ్ అంటూ నవీన్ తనదైన శైలిలో ఫన్నీ కామెంట్స్ చేసి అందరిని ఆకట్టుకున్నారు. అయితే ఇప్పుడు అదే మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో తన కొత్త ప్రాజెక్టుకి శ్రీకారం చుట్టారు నవీన్ పోలిశెట్టి. గత కొన్ని రోజులుగా ప్రముఖ కోలీవుడ్ డైరెక్టర్ తో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో నవీన్ పోలిశెట్టి ఒక సినిమా చేయబోతున్నారు అంటూ వార్తలు రాగా.. తాజాగా ఇప్పుడు ఇది కన్ఫర్మ్ అయినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కోలీవుడ్ డైరెక్టర్ ఆంటోనీ భాగ్యరాజు దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో నవీన్ పోలిశెట్టి తన కొత్త సినిమాను చేయబోతున్నట్లు సమాచారం. మొత్తానికైతే అటు గెట్ టుగెదర్ పార్టీ ఈయనకు బాగా కలిసొచ్చింది అనే కామెంట్లు ఆడియన్స్ నుంచి వ్యక్తం అవుతున్నాయి.. మరి ఈ కోలీవుడ్ డైరెక్టర్ తో నవీన్ పోలిశెట్టి ఎలాంటి సబ్జెక్టుతో మన ముందుకు రాబోతున్నారు అనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అంతేకాదు త్వరలోనే ఈ విషయంపై అఫీషియల్ అనౌన్స్మెంట్ వెలువడనుంది. నవీన్ పోలిశెట్టి కెరియర్ విషయానికి వస్తే.. కామెడీ హీరోగా గా భారీ పాపులారిటీ అందుకున్న ఈయన.. నటుడిగా, స్క్రీన్ రైటర్ గా కూడా మంచి పేరు సొంతం చేసుకున్నారు. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ అనే చిత్రంతో అరంగేట్రం చేసిన నవీన్ .. జాతి రత్నాలు సినిమాతో బ్లాక్ బస్టర్ విజయాన్ని తన ఖాతాలో వేస్తున్నారు.. ఇకపోతే 2023లో విడుదలైన మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి చిత్రంలో అనుష్క శెట్టితో కలిసి స్టాండప్ కమెడియన్ గా నటించి మెప్పించారు. కొంతకాలం గ్యాప్ తీసుకొని మళ్ళీ 2025లో అనగనగా ఒక రాజు చిత్రంలో మీనాక్షి చౌదరి సరసన నటించి ఆకట్టుకున్నారు. ఇక ఇప్పుడు కొత్త ప్రాజెక్టులతో మరిన్ని సక్సెస్ లు అందుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



# ఊహించని రోజు రాబోతున్న ఆదర్శ కుటుంబం.. వర్కౌట్ అయ్యేనా?

ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన విషయం అక్టోబర్ 2వ తేదీన ప్రతి ఒక్కరి ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి అంటూ సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తూ అంచనాలు పెంచేశారు.



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో ఫ్యామిలీ స్టార్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న వెంకటేష్ ఈ వయసులో కూడా వరుస పెట్టి సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ముఖ్యంగా తన సినిమాలతో ఆడియన్స్ను అలరించడమే కాకుండా భారీ బ్లాక్ బాస్టర్ విజయాలను తన ఖాతాలో వేసుకుంటూ యంగ్ హీరోలను ఆశ్చర్యపరుస్తున్నారు. ముఖ్యంగా నేటితరం హీరోలకి పోటీ ఇస్తూ ఫ్యామిలీ జోనర్ ను ఎంచుకొని అటు ఫ్యామిలీ ఆడియన్స్ దగ్గరైన వెంకటేష్ మరో ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేష్ సినిమా ప్రకటించిన రోజు నుంచే అంచనాలు పీక్స్ కి చేరిపోయాయి. అలాంటిది ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన మరో అప్డేట్ సినిమాపై క్యూరియాసిటీని పెంచేసింది. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ లాక్ చేస్తూ వెంకటేష్ పోస్ట్ పంచుకున్నారు. ఈ మేరకు విక్టరీ వెంకటేష్ తన ఎక్స్ ఖాతా ద్వారా ఆదర్శ కుటుంబం సినిమా రిలీజ్ డేట్ ను ప్రకటించారు. ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన విషయం అక్టోబర్ 2వ తేదీన ప్రతి ఒక్కరి ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి అంటూ సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తూ అంచనాలు పెంచేశారు. ఇకపోతే రిలీజ్ డేట్ ప్రకటించారు.. మరి ఆ రిలీజ్ డేట్ సమయం సరైనదేనా అనే కామెంట్లు అభిమానుల నుండి వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే అక్టోబర్ 2 గాంధీ జయంతి ..ఆరోజు మాత్రమే సెలవు. కానీ అక్టోబర్ 11 నుండి అక్టోబర్ 20 వరకు దేవీ శరన్నవరాత్రుల సమయం.. ఆ సమయంలో మొత్తం హాలిడేస్ ఉంటాయి. ప్రేక్షకులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ సినిమాను చూడడానికి వీలుంటుంది. అలాంటిది ఈ సమయాన్ని ఉపయోగించుకోకుండా అక్టోబర్ 2న మాత్రమే రిలీజ్ చేయడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు..అందుకే నిర్మాతలు విడుదల తేదీ పై పునరాలోచన చేయాలి అని కూడా కామెంట్ చేస్తూ ఉండడం గమనార్హం. మరి అభిమానుల అభిప్రాయాలను నిర్మాతలు దృష్టిలో పెట్టుకుంటారా ? లేక అదే రోజు విడుదల చేస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. త్రివిక్రమ్ - వెంకటేష్ కాంబినేషన్లో వస్తున్న ఆదర్శ కుటుంబం ఏకే 47 సినిమా విషయానికొస్తే.. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ పై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఇదిలా ఉండగా మరొకవైపు ఈ సినిమా స్టోరీ పై కాపీ ఆరోపణలు వినిపిస్తూ ఉండడం గమనార్హం. వాస్తవానికి దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ హాలీవుడ్ చిత్రాలను కాపీ కొడతారనే ఆరోపణలు ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. ఇక ఆయన రూపొందించిన ఎన్నో సినిమాలకు ఇలాంటి విమర్శలే వచ్చాయి. ఇక ఇప్పుడు ఆదర్శ కుటుంబం హౌస్ నెంబర్ 47 మూవీకి కూడా అదే రూమర్స్ వస్తున్నాయి. ఈ సినిమా ఇటీవల వచ్చిన అర్జున్ సర్జ బ్లాస్ట్ మూవీ కథతో రాబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో హీరో తమ కుటుంబానికి ఆపద వస్తే ఫ్యామిలీని కాపాడుకోవడం కోసం చేసే పోరాటమే ఈ సినిమా.. ఇప్పుడు వెంకటేష్ హీరోగా రూపొందుతున్న ఈ సినిమా కూడా సేమ్ కథట. వెంకటేష్ ఒక రా ఏజెంట్.. ఫ్లాష్ బ్యాక్ ఉంటుందని, కానీ అవన్నీ వదిలేసి ఫ్యామిలీతో హ్యాపీగా లైఫ్ ని లీడ్ చేస్తూ ఉంటాడని.. అనుకోకుండా తన కుటుంబానికి ఆపద వస్తుందని.. మళ్లీ తాను గతంలోకి వెళ్లి కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నాడు అనే కథతో ఈ సినిమా రాబోతుందని వార్తలు వినిపిస్తున్నాయి. మరి ఇటీవల బ్లాస్ట్ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు సేమ్ కథతో రాబోతున్న ఈ ఆదర్శ కుటుంబాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారా ? అనే కామెంట్లు వ్యక్తం అవుతున్నాయి.

Ho no:LIG-32,, Ph No:- 9247842354, 9059207979,near water tank, Bharat Nagar colony, moos-apet, Hyderabad, pin code 500018.